క్లుప్తంగా

కథల పోటీల్లో విద్యార్థికి బహుమతి



అభిలాష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం సిద్దేశ్వర్

తొగుట(దుబ్బాక): మండలంలోని చందాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థి జిల్లా స్థాయి కథల పోటీల్లో సత్తాచాటాడు. సిద్దిపేట పట్టణానికి చెందిన సుగుణ సాయితి సమితి నిర్వాహకులు ఉగాది పండగను పురస్కరించి జిల్లాస్థాయి కథల పోటీలు నిర్వహించారు. అభిలాష్ రాసిన ఉచితం.. ఉచితం కాదు కథ ఉత్తమ కథగా ఎంపికైంది. నిర్వాహకులు అభిలాష్‌కు ప్రథమ బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు. జిల్లా నుంచి 250 కథలు పోటీలకు రాగా తమ విద్యార్థి రాసిన కథ ఎంపికకావడం సంతోషంగా ఉందని హెచ్‌ఎం సిద్దేశ్వర్ అన్నారు. గత ఏడాది కూడా తమ పాఠశాల విద్యార్థి ప్రథమ బహుమతి సాధించాడన్నారు. అభిలాష్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎంపీహెచ్‌ఏకు అవార్డు ప్రదానం



అవార్డును అందుకుంటున్న జితేందర్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా జగదేవ్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్‌ఏ జితేందర్ రెడ్డి ఉత్తమ జిల్లా టీబీ నోడల్ పర్సన్‌గా అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు మరింత బాధ్యత పెంచిందన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



లక్ష్మీపూర్‌లో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న హుస్నాబాద్ ఏడీఏ మహేష్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో ఇటీవల ఈదురు గాలులతో కురిసిన వడగండ్ల వర్షానికి ధ్వంసమైన పంటలను శనివారం హుస్నాబాద్ ఏడీఏ మహేష్ పరిశీలించారు. మండలంలోని లక్ష్మీపూర్, వడ్లూరు గ్రామాల్లో ఏఈఓలు నమోదుచేసిన పంటల నష్టం వివరాలపై నివేదిక రూపొందించి జిల్లా వ్యవసాయ అధికారికి పంపుతామన్నారు. మూడు రోజుల్లో పూర్తి వివరాలు అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ సంతోష్, ఆత్మ అధికారి సాయిచరణ్, ఏఈఓ సాయిశంకర్, రైతులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేస్తే సహించం



మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్

దుబ్బాక: పార్టీ ఫిరాయింపులపై జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మచ్చ శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాల్వ నరేష్ మండిపడ్డారు. శనివారం దుబ్బాక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చడం చూసి ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతుంటే ఓర్వలేని పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆయనపై అసత్యప్రచరాలు చేస్తున్నాడన్నారు. ప్రజల తీర్పును గౌరవించి పరిపాలనకు సహకరించాలని, లేని పక్షంలో రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా కాన్గల్ వాసి



ప్రవీణ్ కుమార్

తొగుట(దుబ్బాక): హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మండలంలోని కాన్గల్ గ్రామానికి చెందిన మాదారం ప్రవీణ్ కుమార్ ఎన్నికైనట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రవీణ్ కుమార్ యూనివర్సిటీలో విజువల్ కమ్యూనికేషన్స్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా యూనివర్సిటీలో నిర్వహించిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాసిరెడ్డిగారి శ్రీకాంత్ తదితరులు అభినందించారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత

డీఎంహెచ్ఓ శ్రీనివాస్



ఉత్తమ ఆశా వర్కర్ కవితను అభినందిస్తున్న శ్రీనివాస్

సిద్దిపేటకమాన్: క్షయ వ్యాధి నిర్మూలన మన అందరి బాధ్యత అని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినం సందర్భంగా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో వైద్య సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని త్వరితగతిన గుర్తించడం, వ్యాధి తీవ్ర స్థాయి పెరగకుండా చూడటం, కుటుంబ సభ్యులకు రాకుండా నివారణ చర్యలు చేపట్టడం, బాధితులపై ప్రత్యేక శ్రద్ధ వహించడం లాంటివి వైద్య సిబ్బంది చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డాట్స్ పద్ధతిలో బాధితుల ఇంటి వద్దకు వెళ్లి ట్రీట్‌మెంట్ అందిస్తున్నారన్నారు. బాధితులు ఆరు నెలలు తప్పనిసరిగా మందులు వేసుకోవాలన్నారు. రెండు వారాలకు మించి దగ్గు ఉంటే సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, గజ్వేల్, ఆర్వీఎం మెడికల్ కళాశాల, దుబ్బాక, నంగునూర్, చేర్యాల, హుస్నాబాద్ బెజ్జంకిలో తెమడ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఆధునికంగా సీబీ నాట్, ట్రూనాట్ పరీక్షా కేంద్రాలు జిల్లాలో ఉన్నాయని, ఇక్కడ కూడా ఈ పరీక్షలు చేసుకోవచ్చని సూచించారు. అయితే వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన చిన్నకోడూరు పీహెచ్‌సీ డాక్టర్ సరిత, ఉత్తమ ఆశ కవిత, ఉత్తమ టీబీ చాంపియన్, ఉత్తమ ఏఎన్‌ఎంలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు కాశీనాథ్, శ్రీదేవి, వినోద్‌బాబ్జి, విజయరాణి, రజని, శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రగతిలో ఓటే కీలకం

సార్వత్రిక ఎన్నికల్లో యువత ఓటువేయాలి



గజ్వేల్‌లో 5కే రన్ ప్రారంభిస్తున్న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్



5కే రన్ ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకట రెడ్డి

దుబ్బాక: సార్వత్రిక ఎన్నికల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొని ఓటింగ్ నమోదు శాతం పెంచేలా కృషిచేయాలని దుబ్బాక తహసీల్దార్ వెంకటరెడ్డి అన్నారు. స్వీప్ ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం దుబ్బాక పట్టణంలోని ఛత్రపతి విగ్రహం నుంచి యువకులు, విద్యార్థులు, వివిధ శాఖల ఉద్యోగులతో దాదాపు 300 మందితో 5కే రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ, నినాదాలు చేస్తూ ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతిలో ఓటే కీలకమని ఓటుతోనే యువత భవిష్యత్ ముడిపడి ఉందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు జయంత్, గోవర్ధన్, మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్లు వీరేశ్, సందీప్, ఎంపీఓ నరేందర్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్

గజ్వేల్‌రూరల్: ఓటుహక్కు వజ్రాయుధమని, ప్రతీ పౌరుడు ఓటుహక్కు వినియోగించుకోవాలని గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్ అన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ వద్ద విద్యార్థులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కళాశాల నుంచి 5కే రన్ చేపట్టారు. కార్యక్రమంలో గజ్వేల్ తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరి



పోషణ్ పక్వాడ్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో శారద

సీడీపీవో శారద

కొమురవెల్లి(సిద్దిపేట): సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సీడీపీవో శారద అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడ్ ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఈ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా నామకరణం చేశారన్నారు. గర్భిణులు, బాలింతలు, కౌమార దశలో ఉన్న బాలికలు పౌష్టికాహారం తీసుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో మంజుల, సూపర్‌వైజర్ పావని ,అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతాలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని చంద్లాపూర్‌లో పోషణ్ పక్షం కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు అన్న ప్రసాన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో శారద మాట్లాడుతూ చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముర్రు పాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్‌లు, మహిళలు పాల్గొన్నారు.

చిరుధాన్యాల వినియోగం మేలు

మద్దూరు(హుస్నాబాద్): ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంలో చిరుధాన్యాల వినియోగం పెరగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత అన్నారు. శనివారం మండలంలోని లద్నూర్ గ్రామంలోని రైతు వేదికలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు షౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీలో చిరుధాన్యాలతో కలిగే లాభాలను వివరించాలన్నారు.

ముదిరాజ్‌ల బహిష్కరణ అప్రజాస్వామికం

ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్

హుస్నాబాద్: దుబ్బాక నియోజకవర్గం భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామ ముదిరాజ్‌లను కొందరు వెలివేయడం అప్రజాస్వామికమని ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు చొప్పరి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఆంక్షలు విధించి గ్రామ బహిష్కరణ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. మత్స్య సంపదపై, చెరువులపై ముదిరాజ్‌లకు సర్వ హక్కులు ఉన్నాయన్నారు. ప్రభుత్వ జీఓను కాదంటూ కొంత మంది గ్రామస్తులు కవ్వింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి గ్రామ బహిష్కరణ విధించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



సమావేశంలో మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ టికెట్ మాజీ కలెక్టర్ వెంకట్రామిరెడ్డికి ఇవ్వడం సరికాదన్నారు. ఆయన కలెక్టర్‌గా ఉన్నప్పుడు రైతులు వరి వేస్తే ఉరి తప్పదని రైతులను హెచ్చరించారని గుర్తు చేశారు. ఆయనకు పార్లమెంట్ ఎన్నికల్లో ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో సిద్దిపేట యువజన పట్టణ అధ్యక్షుడు గయాసుద్దీన్, నజ్జు, ఫయాజ్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ఫైరింజన్ తరలింపుపై ఆగ్రహం

దుబ్బాకటౌన్: ఫైరింజన్ సిద్దిపేటకు తరలించి, దాని స్థానంలో పాత వాహనం కేటాయించడంపై దుబ్బాక డెవలప్‌మెంట్ కన్వీనర్ మాడబోయిన శ్రీకాంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం దుబ్బాకలో విలేకర్లతో మాట్లాడారు. దుబ్బాక ఫైర్‌స్టేషన్‌కు దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి హయాంలో కేటాయించిన ఫైరింజన్‌ను కుట్రపూరితంగా సిద్దిపేటకు తరలించి కాలంచెల్లిన పాత వాహనం ఇవ్వడం సమంజసం కాదన్నారు. దుబ్బాకలో ఇంత వరకు ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. వారంలోగా కొత్త వాహనం ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



సిద్దిపేటలో నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మందపవన్

తొగుట(దుబ్బాక): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ వర్ధంతి మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాకేష్, సాయితేజ, రంజిత్, సాజన్, హుసెన్, ఈశ్వర్, కార్తీక్, నిరేష్, భాను, నవీన్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

హుస్నాబాద్: భగత్ సింగ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి అమరుల భవన్‌లో శనివారం విప్లవవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, యువ మహిళా జిల్లా కన్వీనర్ రాయికుంట మంజుల, నాయకులు రేవతి, ప్రశాంత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట): భగత్‌సింగ్ 93వ వర్ధంతిని శనివారం బెజ్జంకి మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి, మండల కార్యదర్శి రూపేష్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నేటి యువతకు భగత్‌సింగ్ ఆదర్శనీయుడని, ఆయన చూపిన మార్గంలో యువత పయనించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మందపవన్ అన్నారు. భగత్‌సింగ్ 93వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ విగ్రహానికి వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మండలంలోని తిగుల్ గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు భానుప్రకాష్‌రావు, సుధాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మంజుల మహేందర్‌రెడ్డి వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: బీజేపీ మతోన్మాద రాజకీయాల నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం దుబ్బాక పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తదితరులు ఉన్నారు.

శనీశ్వరునికి అభిషేకాలు



మహామండపంలో సామూహిక పూజలో భక్తులు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతీ శనీశ్వర క్షేత్రం శనివారం శనిత్రయోదశి పర్వదిన వేడుకలతో అలరారింది. మండుటెండ లెక్క చేయకుండా భక్తులు పోటెత్తారు. తిలతైలాభిషేక పూజలు, అమ్మవారి సన్నిధిలో అర్చనలతో క్షేత్రంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో వేద పండితులు తెల్లవారుజామున గణపతిపూజతో శనిత్రయోదశి మహోత్సవ వేడుకలకు అంకురార్పణ చేశారు. పూర్ణకలశ మహామండపం వేదికగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం దాకా విడతల వారీగా భక్తుల సామూహిక తైలాభిషేక పూజలు కొనసాగాయి. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. వేదపండితులు వారితో శాస్త్రోక్తంగా పూజ జరిపించారు. అనంతరం శనీశ్వరుని మూలవిరాట్‌కు తిల తైలం సమర్పించారు. శనిదోషం తొలగించాలని ప్రార్థించారు. పర్వదిన వేళ కొండపైన విశేషాలంకృతులైన విద్యా సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని తరించారు. ఉప ఆలయాల్లో దేవతామూర్తులను దర్శించుకుని మహాప్రసాదం స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వెయ్యి తైలాభిషేకాలు జరిగాయని ఆలయ మేనేజర్ రఘుపవన్ తెలిపారు.

‘బూర’ విజయానికి కృషి చేయాలి

జనగామ అసెంబ్లీ కో– కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న దండ్యాల లక్ష్మారెడ్డి, పక్కన మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు

కొమురవెల్లి(సిద్దిపేట): పార్లమెంటు ఎన్నికలలో భువనగిరి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని జనగామ అసెంబ్లీ కో–కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో భువనగిరి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షులుగా బ్రహ్మాండ్లపల్లి బాబు, ఈగ కనకయ్య, తిరుపతి, కార్యదర్శులుగా అక్కెనపల్లి సంపత్‌రెడ్డి, తలారి నాగరాజు, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా మెరుగు హరికృష్ణ, దళిత మోర్చా అధ్యక్షుడిగా బచ్చల రాజు, కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా శరమందారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మల్లేశం గౌడ్, సనాధి కరుణాకర్, భిక్షపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే

మద్దూరు(హుస్నాబాద్): కరాటే నేర్చుకోవడం ద్వారా విద్యార్థినులు తమను తాము రక్షించుకోగలుగుతారని మద్దూరు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న అన్నారు. రాణీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్ కార్యక్రమంలో భాగంగా గత ఏడాది డిసెంబర్ 15 నుంచి నిర్వహిస్తున్న కరాటే శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది.

బీజేపీ అభ్యర్థికి ఓటమి భయం

సిద్దిపేటజోన్: మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని ప్రకటించడంతో మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావుకు ఓటమి భయం పట్టుకుందని సిద్దిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాయిరాం అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రఘునందన్ రావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

బీఆర్‌ఎస్‌కు మెదక్ కంచుకోట

పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆర్కే శర్మ



మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ

సిద్దిపేటజోన్: ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్‌ఎస్‌కు కంచుకోట అని, మెదక్ లోకసభ ఎన్నికల్లో వెంకట్రామిరెడ్డి విజయం నల్లేరుమీద నడక లాంటిదని పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెదక్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ గెలుపొందిదన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని ఎంపిక చేయడం స్వాగతిస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం కోసం పనిచేస్తామన్నారు.

27న నియోజకవర్గ సమావేశం

లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని అసెంబ్లీల వారీగా కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తామని శర్మ తెలిపారు. కేసీఆర్ ఆదేశాల మేరకు ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో సమావేశాలు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. 27న పొన్నాల శివారు బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే హరీశ్ రావు, బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి హాజరుకానున్నారన్నారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మోహన్ లాల్, భుపేష్, సాయిరాం, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వృద్ధుడి అదృశ్యం



దుబ్బాక: మండల పరిధిలోని దుంపలపల్లికి చెందిన వృద్ధుడు అదృశ్యమైనట్లు దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన చింతకింది రాజయ్య ఈనెల 4వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన బంధు మిత్రులను విచారించినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో రాజయ్య కుమారుడు పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ విద్యార్థులు ఇష్టపడి చదవాలి

హుస్నాబాద్‌రూరల్: విద్యార్థులు ఇష్టపడి చదివే విధంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. శనివారం కూచనపెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి హాజరై మాట్లాడారు. పిల్లల అభిరుచులు, అలవాట్లను తెలుసుకొని సులభ పద్ధతిలో విద్యాబోధన చేస్తే పిల్లలు చదువుల్లో ముందుంటారన్నారు. విద్యార్థులు చేసిన నృత్యాలు గ్రామస్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పద్మ, వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్, శంకర్ పాల్గొన్నారు.

◆ బాల్యమిత్రుడి కుటుంబానికి చేయూత

సిద్దిపేటరూరల్: బాల్యమిత్రుడి కుటుంబానిక తోటి మిత్రులు చేయూత అందించారు. జంగం యాదగిరి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. పుల్లూరులో 1996–97లో చదువుకున్న విద్యార్థులు అతడి కుటుంబానికి రూ.29,500 ఆర్థిక సాయం చేశారు. భవిష్యత్‌లోనూ మిత్రుడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

◆ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

హుస్నాబాద్: షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోని సామాన్లు కాలిపోయాయి. పట్టణంలోని ఓ ఇంటిలో విష్ణు అద్దెకు ఉంటున్నాడు. మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు రేగడంతో వెంటనే కరెంట్ సరఫరా నిలిపివేశారు. ప్రమాదంలో ఇంటిలోని సామానులు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలనూ అదుపులోకి తెచ్చారు.

◆ గులాబీ జెండా ఎగురవేస్తాం

గజ్వేల్‌రూరల్: త్వరలో జరుగనున్న మెదక్ పార్లమెంటు ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని గజ్వేల్ ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానికతపై బీజేపీ నేత రఘునందన్‌రావు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బీజేపీకి అభ్యర్థులు దొరక్కపోవడంతో బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎంపీ, ఎమ్మెల్యేలను చేర్చుకొని ఎంపీ అభ్యర్థులుగా ఎందుకు ప్రకటించారో చెప్పాలన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

◆ నూతన కార్యవర్గం ఎన్నిక

ములుగు(గజ్వేల్): మండలంలోని వంటిమామిడిలో బీజేపీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ శనివారం తెలిపారు. మండల ప్రధాన కార్యదర్శులుగా మల్యాల స్వామి, బద్ది భాస్కర్, ఉపాధ్యక్షులుగా కొండు నర్సింహులు, బాబు, మహేష్‌గౌడ్, బట్టు ఎలందర్, జీడి కనకయ్య, కార్యదర్శిగా నరేష్‌గౌడ్, యువమోర్చా అధ్యక్షుడిగా కృష్ణయాదవ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా స్వామిగౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పల్లె నవీన్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా కృష్ణ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా అశోక్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా షహీద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

◆ బీజేవైఎం కమిటీ ఎన్నిక

నంగునూరు(సిద్దిపేట): బీజేవైఎం నంగునూరు మండల అధ్యక్షుడిగా దీపక్‌గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు నీలం దినేష్ ప్రకటించారు. శనివారం నంగునూరులో కార్యకర్తల సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా పరమేశ్వర్, అనిల్, రాజు, ఉపాధ్యక్షులుగా పర్శరాములుగౌడ్, ప్రతాప్‌రెడ్డి, ప్రశాంత్, స్వామి, కార్యదర్శులుగా కృష్ణప్రసాద్, హరీష్, రవి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కల్యాణ్‌దాస్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.